క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీల్లో మొదటి స్థానం



విజేతలతో ప్రిన్సిపాల్, శిక్షకురాలు

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 5, 6,7 తేదీల్లో ప్రభుత్వ పాలిటెక్నిక్ క్రీడా మైదానం అనంతపురంలో జరిగిన రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో (ఐపీఎస్‌జీఎం 2023–24) నంద్యాల పాలిటెక్నిక్ విద్యార్థులు ప్రతిభ చూపి మొదటి స్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసప్రసాద్ మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈఎస్సీ ప్రభుత్వ పాలిటెక్నిక్ నంద్యాలకు చెందిన బాలురు, బాలికలు బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటడం అభినందనీయమన్నారు. రాష్ట్రస్థాయిలో విజేతలుగా నిలిచిన నంద్యాల క్రీడాకారులు సౌత్ జోన్ క్రీడల్లో పాల్గొంటారని చెప్పారు. క్రీడాకారులకు శిక్షణ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్ పీఎస్ మార్గరేట్‌ను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ఎర్రమల విక్టర్ ప్రసాద్, ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్ విభాగాల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని బాలా అకాడమీ రవీంద్ర హైస్కూల్‌లో మంగళవారం కరాటే విద్యార్థులకు బెల్ట్ గ్రేడింగ్ ఎగ్జామ్ నిర్వహించారు. ఈ ఎగ్జామ్‌లో 50 మంది విద్యార్థులు పాల్గొని ఆరెంజ్, ఎల్లో బెల్ట్‌లు సాధించారని కరస్పాండెంట్ రవీంద్రనాథ్, ప్రిన్సిపాల్ మాధవీలత తెలిపారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్లు మహేష్, చంద్ర, రామకృష్ణ, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను పనిలో పెట్టుకోవద్దు



షాపులో తనిఖీ చేస్తున్న లేబర్ ఆఫీసర్

నంద్యాల(వ్యవసాయం): బడిలో ఈడు పిల్లలను పనిలో పెట్టుకోకూడదని పని చేయించుకునే యజమానులు శిక్షార్హులు అవుతారని పట్టణ లేబర్ అధికారి మురళీ కృష్ణ హెచ్చరించారు. మంగళవారం లోక్‌అదాలత్ సభ్యులచే పట్టణంలో పలు హోటళ్లు, దుకాణాలు, మెకానిక్ షాపుల్లో తనిఖీ నిర్వహించారు. ఓ దుకాణంలో పని చేస్తున్న పిల్లవాడిని విడిపించి యజమానికి అపరాధ రుసుము విధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ మెంబర్ శీలం ఓబులరెడ్డి, రామచంద్రారెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.


వైభవంగా ఆలయ వార్షికోత్సవం



అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న శ్రీనీలకంఠేశ్వర నర్మద, మధు వర్ణ బాలలింగస్వామి మందిరం ప్రథమ వార్షికోత్సవ వేడుకలను మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే స్వామి వారికి వేదపండితులు మాడుగుల నాగేంద్రశర్మ ఆధ్వర్యంలో పంచామృతాభిషేకాలు, మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, కనకాభిషేకాన్ని నిర్వహించారు. అనంతరం మృత్యుంజయ హోమాన్ని నిర్వహించి పూర్ణాహుతి గావించారు. భక్తులకు అన్నదాన వితరణ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది రావినూతల దుర్గాప్రసాద్, డాక్టర్ దివీ హయగ్రీవాచార్యులు, రామచంద్రమూర్తి, నగరజోన సుదీర్ తదితరులు పాల్గొన్నారు.

యాళ్లూరు ఆసుపత్రిలో అన్నదానం



అన్నదానం చేసిన దృశ్యం

గోస్పాడు: యాళ్లూరు ప్రభుత్వ ఆసుపత్రిలో వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు శకుంతలమ్మ సహకారంతో మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం యాళ్లూరు ప్రభుత్వ హాస్పిటల్‌లో ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్(పీఎంఎస్ఎంఏ) కార్యక్రమం జరిగింది. అనంతరం గర్భిణులకు, ఆసుపత్రికి వచ్చిన రోగులకు మధ్యాహ్న సమయంలో భోజన సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు మాధవి, రాజేష్, శివాని తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా సీఎం జగనన్న

- నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి
- ప్రజాసంకల్పయాత్రకు ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా సంబరాలు



వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి, వైఎస్సార్‌సీపీ నాయకులు

నంద్యాల(అర్బన్): ప్రజా సంకల్ప యాత్రతో పేదల కష్టాలు, కడగండ్లను దగ్గరగా చూసి వారి జీవితాల్లో వెలుగులు నింపిన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి కోరారు. ప్రజాసంకల్ప యాత్ర ప్రారంభించి ఐదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని స్థానిక ఎమ్మెల్యే నివాసంలో మంగళవారం పార్టీ శ్రేణులతో కలిసి కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నవరత్నాలతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి పేద గడపకు సంక్షేమ ఫలాలు అందించారన్నారు. రాష్ట్రంలో సంక్షేమంతో పాటు అభివృద్ధిని సాధించిన ముఖ్యమంత్రికి ప్రజలు అండగా నిలవాలన్నారు. రానున్న ఎన్నికల్లో జగనన్నను గెలిపించేందుకు రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారని, అదే విధంగా నంద్యాలలో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ మహేశ్వరరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, బెస్త సంఘం కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గిరిబోయిన చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంకల్పయాత్ర చరిత్రాత్మకం

దొర్నిపాడు: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన ప్రజా సంకల్ప యాత్ర చరిత్రాత్మకమని సొసైటీ చైర్మన్ భూమా చెంచిరెడ్డి అన్నారు. పాదయాత్ర చేపట్టి 5 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ సుదీర్ఘ పాదయాత్రలో ప్రజల కష్టాలను తెలుసుకొని అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారన్నారు. కార్యక్రమంలో నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, లక్ష్మీ కాంతరెడ్డి, ఐత్తుల కృష్ణయ్య, భూమా శ్రీనివాసరెడ్డి తదితరులు ఉన్నారు.

ఉయ్యాలవాడలో..

ఉయ్యాలవాడ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్ప యాత్ర 5 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఉయ్యాలవాడలో మహానేత వైఎస్సార్ విగ్రహానికి , సుద్దమల్లలో ఆయన చిత్రపటానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండలాధ్యక్షురాలు బుడ్డా భాగ్యమ్మ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బుడ్డా చంద్రమోహన్‌రెడ్డి, గ్రామ సర్పంచ్‌లు పల్లె గురప్రసాద్‌రెడ్డి, మేకల ఓబులేస్, పల్లె రామమద్దిలేటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో సంక్షేమ బాట

ఆళ్లగడ్డ : ప్రజా సంకల్ప యాత్రలో అన్ని వర్గాలను పలకరించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక 'నవరత్నాలతో' రాష్ట్రంలో సంక్షేమ బాట పరిచారని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు నరసింహారెడ్డి అన్నారు. ప్రజా సంకల్ప యాత్ర పూర్తిచేసుకుని ఐదు సంవత్సరాలు పూర్తయిన సందర్భాన్ని పురష్కరించుకుని మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో కేకు కట్ చేశారు. అనంతరం నాలుగు రోడ్ల కూడలిలోని దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహానికి పూలల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సుధాకర్‌రెడ్డి, రమేష్‌గౌడ్, యాదవాడ నరసింహారెడ్డి, మాదం చెన్నయ్య ఉన్నారు.

శిరివెళ్ల: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్ప యాత్ర వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ దిల్షాద్ బేగం, ఎంపీపీ నాయక్ వసీం, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బీ.అబ్దుల్ సలాం, సర్పంచు సాలమ్మ, ఉప సర్పంచు ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.



సుద్దమల్లలో వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ, నాయకులు



ఆళ్లగడ్డలో సంబరాలు చేసుకుంటున్న నాయకులు



శిరివెళ్లలో కేక్ కట్ చేస్తున్న కార్యకర్తలు

'పరీక్షా పే చర్చ' నమోదుకు 12 వరకు గడువు

నంద్యాల(న్యూటౌన్): ఏటా పబ్లిక్ పరీక్షల ముందు పరీక్షా పే చర్చ కార్యక్రమాన్ని కేంద్రం నిర్వహిస్తోంది. కేంద్ర మానవ వనరుల శాఖ ఆధ్వర్యంలో ఏటా పబ్లిక్ పురీక్షల ముందు పరీక్షా పే చర్చ కార్యక్రమం నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా దేశ వ్యాప్తంగా బోర్డు పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులతో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేరుగా సంభాషిస్తారు. కార్యక్రమంలో పాల్గొనేందుకు 6 నుంచి 12 తరగతులు చదివే విద్యార్థులు అర్హులు. విద్యార్థులు తమ ప్రశ్నను ప్రధానమంత్రిని నేరుగా అడగవచ్చు. ప్రశ్న గరిష్ఠంగా 500 అక్షరాలలోపు ఉండాలి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కూడా పరీక్షా పేచర్చలో పాల్గొనవచ్చు. వారి ఎంట్రీలను కూడా ఆన్‌లైన్‌లో పంపే అవకాశాన్ని కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ కల్పించింది. ఆన్‌లైన్ (https://innovateindia.mygov.in)లో నమోదుకు జనవరి 12వరకు గడువు ఉంది. పరీక్షా పే చర్చ కార్యక్రమంలో విజేతలుగా నిలిచినవారు నేరుగా ప్రధాన మంత్రిని కలుసుకునే అవకాశం ఉంటుంది.

ప్రొద్దుటూరుకు వెళ్లి పింఛన్ అందజేత



మాబుసాహెబ్‌కు పింఛన్ అందజేస్తున్న వలంటీర్

ఉయ్యాలవాడ : మండలంలోని పడిగెపాడు గ్రామానికి చెందిన దూదేకుల మాబుసాహెబ్ వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూ రు పట్టణంలో గుండె ఆపరేషన్ చేయించుకున్నాడు. ఈయన అక్క డే బంధువుల ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న గ్రామ వలంటీర్ దస్తగిరి మంగళవారం అక్కడికి వెళ్లి ఫింఛన్ సొమ్ము రూ. 3 వేలు అందజేశాడు.

హైదరాబాద్‌కు వెళ్లి పింఛన్ పంపిణీ



పింఛన్‌ను అందజేస్తున్న వలంటీర్ యశోద

నంద్యాల(అర్బన్): పట్టణంలోని 26వ వార్డు దేవనగర్‌కు చెందిన ఎం.నాగమల్లయ్యకు కాలు విరగడంతో హైదరాబాద్‌లో బంధువుల వద్ద ఉంటూ చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న వలంటీర్ యశోద దూర భారాలకు ఓర్చి హైదరాబాద్‌కు వెళ్లి అతనికి పింఛన్ అందజేసింది. దీంతో ఆమెను నాగమల్లయ్య కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

అన్ని వర్గాల అభివృద్ధి కోసమే సంక్షేమ పథకాలు

నంద్యాల(సిటీ): అన్ని వర్గాల అభివృద్ధి కోసమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఉదయం గాంధీనగర్, గట్టాలనగర్‌లో, సాయంత్రం 25వ వార్డు సాయిబాబనగర్‌లో గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమాన్ని కౌన్సిలర్ కృష్ణమోహన్, వెంకటలక్ష్మిల ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా వార్డు ప్రజలు, నాయకులు ఎమ్మెల్యేకు హారతులు ఇచ్చి ఘన స్వాగతం పలికారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి ఒక్కరికీ మంచి చేస్తున్నందుకే ప్రజల్లో ధైర్యంగా తిరుగుతున్నామని ఎమ్మెల్యే అన్నారు. ముందుగా వార్డులోని సమస్యలను సత్వరమే పరిష్కరించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రజలకు వివరించి, పథకాల ద్వారా వారి కుటుంబాలకు జరుగుతున్న మంచిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిల్పారవి మాట్లాడుతూ ప్రజల మంచిని కోరుతూ వారి యొక్క బాగోగులు చూసే నాయకుడు దేశంలో సీఎం వైఎస్ జగనన్న తప్ప ఎవరూ లేరన్నారు. ప్రతి ఒక్కరూ బాగుపడాలని చూస్తున్న ఏకైక నాయకుడన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్ మాబున్నిసా, రాష్ట్ర దృశ్యకళల డైరెక్టర్ సునీత అమృతరాజ్, వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, వార్డు వైఎస్సార్ సీపీ నాయకులు రాగిపోగు శ్రీనివాసులు, మౌలాలి, దస్తగిరి, కబీర్‌బ్రదర్స్, ఖాసీం, హిదాయతుల్లా, రమేష్, సల్మాన్, శ్రీను, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

నంద్యాల(అర్బన్): నియోజకవర్గానికి సంబంధించి పలువురు రోగుల కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.9.5 లక్షలకు సంబంధించిన చెక్కులను మంగళవారం ఎమ్మెల్యే శిల్పా రవి అందించారు. అందులో సారంగి సురేఖ కుటుంబానికి రూ.5.30లక్షలు, మరో నలుగురికి రూ.3.75 లక్షలు మంజూరయ్యాయి.

రైల్వే ఉద్యోగులకు సంఘీభావం

నంద్యాల(సిటీ): పాత పెన్షన్ పునరుద్ధరణ కోసం నంద్యాల రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు చేపట్టిన నిరాహార దీక్షలకు నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి సంఘీభావం తెలియజేశారు. మంగళవారం స్థానిక నంద్యాల రైల్వే స్టేషన్ పరిధిలో నిరాహార దీక్షలను రైల్వే మజ్దూర్ యూనియన్ అదనపు డివిజనల్ కార్యదర్శి అబ్దుల్ హక్ ఆధ్వర్యంలో చేపట్టగా శిబిరాన్ని ఎమ్మెల్యే సందర్శించారు.



లబ్ధిదారుడికి సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పారవి

నంద్యాలలో 'జన్ భాగీదారి'



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(సిటీ): పట్టణంలోని దేవనగర్ ప్రాంతంలో మంగళవారం మెప్మా సీఎంఎం విజయభాస్కర్ రెడ్డి స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి జన్ భాగీదారి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జన్ భాగీదారి నిర్వహణ ద్వారా సామాజిక అసమానతలు రూపు మాపడానికి అంబేడ్కర్ సూచించిన బాటలో ప్రతి ఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు. విజయవాడలో ఈ నెల 19వ తేదీన 120 అడుగుల ఎత్తైన బీఆర్ అంబేడ్కర్ 'సామాజిక న్యాయ మహా శిల్పం' విగ్రహావిష్కరణ ఉంటుందన్నారు. విగ్రహావిష్కరణకు మద్దతుగా ర్యాలీ చేసి ప్రజల్లో అవగాహన కల్పించారు. సామాజిక న్యాయమార్గంలో నడుస్తానని.. అందరితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో 26వ వార్డు కౌన్సిలర్ మేస చంద్రశేఖర్, 27వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ బాషా తదితరులు పాల్గొన్నారు

చాగలమర్రి: మండలంలోని డి.వనిపెంట సచివాలయంలో మంగళవారం నిర్వహించిన జన్ భాగీదారి కార్యక్రమంలో ఎంపీడీఓ మహబూబ్‌దౌలా పాల్గొన్నారు. మండలంలోని 17 సచివాలయాల్లో అంబేడ్కర్ చిత్ర పటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. అలాగే సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో సర్పంచ్ బాలీశ్వరరెడ్డి, కార్యదర్శి రాజశేఖర్ పాల్గొన్నారు.

ఘనంగా షేక్ ఫాతిమా జయంతి

నంద్యాల(వ్యవసాయం): సంఘసంస్కర్త షేక్ ఫాతిమా జయంతి వేడుకలను నంద్యాల జిల్లా ముస్లిం రచయితల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక నవభారత్ పబ్లిక్ స్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అబ్దుల్‌సమ్మద్ మాట్లాడుతూ జ్యోతిరావు పూలే, సావిత్రీబాయి పూలే అడుగు జాడల్లో నడుస్తూ ముస్లిం యువతుల్లో చదువులో విప్లవాన్ని తెచ్చారన్నారు.



ఫాతిమా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

కార్యక్రమంలో నవభారత్ హుసేన్, నీలకఠమాచారి, అబ్దుల్ వాహబ్, రవి, సలీమ్ పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

నంద్యాల టౌన్: అక్రమంగా తరలిస్తున్న 40 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్టు రెండవ పట్టణ సీఐ రాజారెడ్డి తెలిపారు. మంగళవారం నంద్యాల పట్టణంలోని బీకే సింగ్ కాలనీలో జనార్దన్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి అనే వ్యక్తులు ఆటోలో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తుండగా వారిని అదుపులోకి తీసుకొని, ఆటో, 40 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

గోశాలకు రూ.20వేలు విరాళం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీలో వెలసిన గోశాలకు ఆర్యవైశ్య సంఘం నాయకుడు గోళ్ల రాజేష్ రూ.20వేలు మంగళవారం నిర్వాహకులు బసవరాజుకు అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

జొన్న కొనుగోళ్లపై అవగాహన సదస్సులు

నంద్యాల(అర్బన్): జొన్న దిగుబడుల కొనుగోళ్లపై మండలంలోని పులిమద్ది, భీమవరం గ్రామాల్లో మంగళవారం మండల వ్యవసాయాధికారి ప్రసాద రావు ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహించారు. గ్రామ సర్పంచ్‌లు రఘురామిరెడ్డి, భక్త వత్సలమ్మల అధ్యక్షతన జరిగిన కార్యక్రమాల్లో ఏఓ మాట్లాడుతూ క్వింటా రూ.3180 జొన్న కొనుగోళ్ల జరుగుతుందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వీహెచ్‌పీ కార్యాలయానికి వితరణ

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని టెక్కె ప్రాంతంలో నూతనంగా నిర్మిస్తున్న విశ్వహిందూ పరిషత్ కార్యాలయ భవనానికి బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ అభిరుచి మధు విరాళం అందజేశారు. మంగళవారం భజరంగదళ్ స్టేట్ కో కన్వీనర్ పోలేపల్లి సందీప్ రూ.లక్ష నగదును అందించారు. అనంతరం భరతమాత దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమలో భరతమాత సేవా సమితి కార్యదర్శి సముద్రాల మధు, సూర్యతేజ, అర్చకులు సుధాకర్‌శర్మ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి పక్కాగా ప్రణాళికలు



మాట్లాడుతున్న డీపీఓ మంజులవాణి

నంద్యాల(అర్బన్): 2024–25 ఏడాదికి సంబంధించి గ్రామాల అభివృద్ధి ప్రణాళికలు పక్కాగా తయారు చేయాలని డీపీఓ మంజులవాణి సూచించారు. స్థానిక వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో మంగళవారం ఎంపీడీఓలు, ఈఓఆర్‌డీలు, పీఎస్‌లు, ఇంజనీర్లు, కంప్యూటర్ ఆపరేటర్లకు రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని డీపీఓ మంజులవాణి ప్రారంభించారు. రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ యోజన, పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రామాలకు అవసరాలు, నిధులకు సంబంధించిన యాక్షన్ ప్లాన్‌ను తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో డీఏఓ మోహన్‌రావు, డీఎల్‌పీఓ రాంబాబు, ఎన్ఆర్‌ఈజీఎస్ పీడీ రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెంచుల అభివృద్ధికి పీఎం-జన్‌మన్



డి.వనిపెంటలో సమావేశం నిర్వహిస్తున్న అధికారులు

చాగలమర్రి: కేంద్రం ప్రభుత్వం గిరిజన సంక్షేమం కోసం పీఎం–జన్‌మన్ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని సర్పంచ్ బాలీశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం ఎంపీడీఓ మహబూబ్‌దౌలా ఆధ్వర్యంలో డి.వనిపెంట, చాగలమర్రిలోని చెంచుగూడేల్లోని గిరిజనులతో సమావేశం నిర్వహించారు. గిరిజనులకు మౌలిక సదుపాయాల కల్పనపై కేంద్ర ప్రభుత్వం దృష్టిసారించిందని, ఇందుకు ప్రత్యేక నిధులు మంజూరు చేసిందని ఐటీడీఏ ప్రాజెక్టు ఏపీఓ జోహార్‌బాషా తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ సుభద్రమ్మ, స్థానిక కార్యదర్శి రాజశేఖర్, ఎఓ రంగ నేతాజీ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా దుస్తుల పంపిణీ

చాగలమర్రి : మండల పరిధిలోని 17 సచివాలయాలలో ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలలో ప్రతిభ చూపి మండల స్థాయి పోటీలకు ఎంపికైన 223 మంది క్రీడాకారులకు మంగళవారం టీ షర్టులు, టోపీలను పంపిణీ చేశారు. స్థానిక 2వ సచివాలయంలో చాగలమర్రి మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ తొలసమ్మ, ఇన్‌చార్జ్ ఈఓ నాగమణి 5 సచివాలయాలలో క్రీడాకారులకు సామగ్రిని అందజేశారు.

నేటి నుంచి మండలస్థాయి క్రీడలు

రుద్రవరం: మండల కేంద్రమైన రుద్రవరంలో బుధవారం నుంచి ఈ నెల 20వ తేదీ వరకు ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి క్రీడా పోటీలు ఉంటాయని ఎంపీ డీఓ మధుసూదనరెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించి వివిధ శాఖల అధికారులు,వలంటీర్లు మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

గోస్పాడు: మండల కేంద్రంలో ఎంపీడీఓ అనసూయ జూనియర్ కళాశాల విద్యార్థులు ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

పైపులైన్ పనుల పరిశీలన

నంద్యాల(అర్బన్): నంద్యాల మండలం పాండురంగాపురం గ్రామంలో తాగునీటి పథకాల పనులు వేగంగా జరుగుతున్నాయి. మంగళవారం ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మధుసూదన్, ఎంపీడీఓ సుగుణశ్రీ, ఏఈ మురళీనాయక్, గ్రామ పెద్దలు ట్యాంకు, పైపులైన్ పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యత లోపం లేకుండా చూడాలని, ఎక్కడైనా నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని కాంట్రాక్టర్‌ను డీఈ హెచ్చరించారు.

ఇంజినీరింగ్ విద్యార్థులు నిస్వార్థంగా సేవలందించాలి

నంద్యాల(న్యూటౌన్): ఇంజినీరింగ్ విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి నిస్వార్థంగా సేవలు అందించాలని జిల్లా విద్యాశాఖ అధికారి సుధాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం నంద్యాలలో జరిగిన సమావేశంలో డీఈఓ మాట్లాడుతూ వెబెక్స్ కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యా శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్, ఉన్నత విద్యాశాఖ చైర్మన్, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్ కుమార్ ఆదేశాల మేరకు ఇంజినీరింగ్ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఈనెల 22వ తేదీ నుంచి నాలుగు నెలల పాటు వారికి కేటాయించిన ప్రభుత్వ పాఠశాలలకు హాజరు కావాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఎలక్ట్రానిక్ ఉపకరణాలైన ఐఎఫ్‌పీ ట్యాబ్‌లు, స్మార్ట్ టీవీలపై ఉపాధ్యాయులకు, విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఎంఈఓలు, హెచ్‌ఎంలు, హెచ్‌ఓడీలు, లెక్చరర్లు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి భరోసా

ఉయ్యాలవాడ : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తోందని ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని సుద్దమల్ల గ్రామ సచివాలయం ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బుడ్డా చంద్రమోహన్‌రెడ్డి, గ్రామ సర్పంచ్‌లు రామమద్దిలేటిరెడ్డి, గురుప్రసాద్‌రెడ్డి, హసానమ్మ తదితరులు పాల్గొన్నారు.

చాగలమర్రి: మండలంలోని మద్దూరు గ్రామంలోని ఉన్నత పాఠశాల భవనాలలో మంగళవారం వైద్యాధికారి షేక్.ఇమ్రాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫేస్–2 జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేక వైద్య శిబిరంలో సుమారు 414 మంది వైద్య సేవలు పొందారు. శిబిరంలో ఊపిరితిత్తుల వ్యాధి నిపుణులు ప్రనుష, జనరల్ ఫీజిషియన్ దినేష్, షేక్ ఇమ్రాన్, కంటి వైద్య సహాయకురాలు సౌజన్య వైద్య సేవలు అందించారు.



సుద్దమల్లలో కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ

రుద్రవరం: మండల పరిధిలోని ఎల్లావత్తుల జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మంగళవారం అధికారులు, వైద్యులు రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యులు శివమోహన్, ప్రశాంత్, ప్రియదర్శిని 442 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మధుసూదనరెడ్డి, ఈఓపీఆర్డీ శ్రీనివాసశర్మ పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు

నంద్యాల(న్యూటౌన్): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని శ్రీ గురురాజ విద్యాసంస్థల డైరెక్టర్ షేక్షావలి రెడ్డి, నంద్యాల జిల్లా స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రధాన కార్యదర్శి దండెనాగరాజు, ఏపీ సీఎం కప్ కో ఆర్డినేటర్ ఉమ్మడి జిల్లాల సెక్రటరీ ఏపీరెడ్డి, ఏపీ స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ జాకీర్ హుసేన్ అన్నారు. మంగళవారం నంద్యాల పట్టణంలోని ఇండోర్ స్టేడియం క్రీడా మైదానంలో ఉమ్మడి జిల్లాల కబడ్డీ జూనియర్ బాలురు, బాలికల పోటీలను ప్రారంభించారు.

భూ రీ సర్వేపై ఆందోళన అవసరం లేదు

దొర్నిపాడు: భూ రీసర్వేలో పొలాల విస్తీర్ణంలో హెచ్చు తగ్గులు వచ్చినా రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి, తహసీల్దార్ జయప్రసాద్ అన్నారు. మంగళవారం జగనన్న శాశ్వత భూహక్కు మరియు భూ సురక్ష పథకంలో భాగంగా గుండుపాపల గ్రామంలో సర్పంచ్ వెంకటేశ్వర్లు అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఇప్పటికే భూ హక్కు పత్రాలు ఇచ్చామని, వాటిలో పొలం విస్తీర్ణం తక్కువగా ఉంటే వెంటనే తగిన ధ్రువపత్రాలు ఇవ్వాలని రైతులను కోరారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ మల్లయ్య, జేసీఎస్ కన్వీనర్ వీఆర్‌ఓ మురళీ తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య శాలలకు మందుల పంపిణీ

నంద్యాల (సెంట్రల్): జిల్లాలోని ప్రాంతీయ పశువైద్యశాలలు, ఉప కేంద్రాలకు ఈ ఆర్థిక సంవత్సరం మొదటి రెండు త్రైమాసికాలకు సంబంధించి మందుల పంపిణీ పూర్తి చేసినట్లు జిల్లా పశువైద్యాధికారి గోవింద నాయక్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జనరల్ మెడిసిన్, దూడల సంరక్షణకు సంబంధించిన కాఫ్ రియరింగ్ మందులు సరిపడా ఇచ్చినట్లు పేర్కొన్నారు.

మహిళలకు వంటల పోటీలు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని శ్రీమతి కొట్టె సుబ్బమ్మ బాలాజీ మర్చెంట్ కమిటీ, కల్యాణ మండపం ఆధ్వర్యంలో మహిళలకు మంగళవారం వంటల పోటీలను నిర్వహించారు. న్యాయ నిర్ణేతలుగా ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ, వసుధ, మనోహర్‌రెడ్డి వ్యవహరించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. నిర్వాహకులు కొట్టె కృష్ణమూర్తి, చంద్రశేఖర్, భవనాశి నాగమహేష్, నారాయణ, శ్రీనివాస్‌కుమార్ పాల్గొన్నారు.